రోలుగుంటలో గిరిజనుల ఆందోళన

సాగు భూములకు అటవీ హక్కుల పట్టాలు డిమాండ్

విశాలాంధ్ర-రోలుగుంట: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రోలుగుంట మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు గిరిజనులు ఆందోళన నిర్వహించారు. వీరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డీఎల్‌సీ ఏర్పాటుచేసి, సాగులో ఉన్న భూములకు అటవీ హక్కుల పట్టాలు ఇవ్వాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే అర్ల పంచాయతీ పరిధిలోని గుర్రాలు బైలు, గదవపాలెం గ్రామాలకు ప్రత్యేక రేషన్ పాయింట్ ఏర్పాటు చేయాలని, వర్షం వచ్చినప్పుడు విద్యుత్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అర్ల, పిత్రిగడ్డ, లోసింగి, పెద్దగోరువు, గుర్రాలు బైలు, కొరుప్రోలు, ఎం.పేట, పనసలపాడు, గంగవరం గ్రామాల 96 గిరిజన కుటుంబాలు 30 ఏళ్లుగా సాగుచేస్తూ వున్నప్పటికీ పట్టాలు పొందలేదని, భూములు కొందరు లాక్కోబోతున్నారని పేర్కొన్నారు. వీరు కలెక్టర్ ఒకరోజు రాత్రి బస చేసి సమస్యలు పరిశీలించాలని, ఎమ్మార్వో నాగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ.చిరంజీవి, గిరిజన సంఘం నాయకులు కొర్ర కొండబాబు, గేమ్మిలి చంద్రరావు, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర-కె.కోటపాడు : స్థానిక 33 /11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ లో పలువిభాగాల నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు నిలుపుదల చేయడం జరుగుతుందని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. కే కోటపాడు కింతాడ దాలివలస మర్రివలస గొట్లాం కే. సంతపాలెం మేడిచర్ల ఆర్ ఎస్ పాలెం పైడం పేట ఏ. భీమవరం తదితర గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మండల వైసీపీ ప్రధాన కార్యదర్శిగా గంగు నాయుడు

విశాలాంధ్ర-కశింకోట: మండల వైసీపీ ప్రధాన కార్యదర్శిగా, జమాదుల పాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఒమ్మి గంగు నాయుడు ను, నియమించినట్లు గురువారం రాష్ట్ర వైసీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ, నాపై ఎంతో నమ్మకంతో,ఈ పదవి రావటానికి కృషిచేసిన అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండలంలోని వైయస్సార్సీపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. వైయస్సార్సీపి కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ముందుండి ఆ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. గంగునాయుడుకు ఈ పదవి రావడం పట్ల మండలంలో ఉన్న పలువురు నాయకులు, కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు.

17, 18న రోలుగుంట మండల స్థాయి క్రీడోత్సవాలు

విశాలాంధ్ర-రోలుగుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రోలుగుంట మండల స్థాయి క్రీడోత్సవాలు ఈనెల 17, 18న రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. హెచ్ఎం టీవీ శేషగిరిరావు తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో అండర్-14, అండర్-17 సంవత్సరాల బాలబాలికలు పాల్గొననున్నారు. గేమ్స్ ఫెడరేషన్ సిబ్బంది మరియు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు గురువారం సమావేశం కూరుకుని పోటీల ఏర్పాట్లను, ఆటల షెడ్యూల్ మరియు వేదికల ఏర్పాట్లను సమీక్షించారు. విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాట్మింటన్, అథ్లెటిక్స్, చెస్, యోగ వంటి వివిధ క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించవచ్చునని తెలిపారు. పరిశీలనలో భాగంగా సురక్షిత వాతావరణం, క్రీడా సామగ్రి సదుపాయాలు, మొదలైన అంశాలను కూడా పునరాలోచన చేసారని వెల్లడించారు. క్రీడోత్సవాల ద్వారా విద్యార్థులలో క్రీడా పట్ల అభిరుచి పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు



విశాలాంధ్ర-పాయకరావుపేట : నక్కపల్లి మండలం, డొంకాడ గ్రామానికి చెందిన చందిన నూకరాజు(65) ఈ నెల 8వ తేదీ నుంచి కనిపించట్లేదని ఆయన అల్లుడు కీర్తి వెంకట అప్పారావు పాయకరావుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నూకరాజు వ్యవసాయ పనులు చేస్తాడని, ఈనెల 8వ తేదీన పాయకరావుపేట వై జంక్షన్ వద్ద తనకు చెందిన మోటార్ సైకిల్ పార్కింగ్ చేసి అక్కడ నుంచి కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటినుంచి బంధువులకు, ఇతర స్నేహితులకు సమాచారం అందజేసిన ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9705804534 సెల్ నంబర్ కు సమాచారం అందజేయాలని కీర్తి వెంకట అప్పారావు కోరారు.

గెడ్డపాలెం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ జాతీయ రహదారి నుంచి సుమారు 1.5 కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. గెడ్డపాలెం గ్రామంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ,మాజీ ఎంపీపీ వై .వినోద్ రాజు చే భూమి పూజ చేసి కొబ్బరికాయలు కొట్టడం జరిగింది రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎన్నికల ముందు హెూం శాఖామంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన హామీ మేరకు సుమారు 60 లక్షల రూపాయలు నాబార్డ్ నిధులను మంజూరు. చేయించారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తన్నీరు గంగా లక్ష్మి, పాలపర్తి పాపారావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు ,బాలం భవాని, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ ,తుమ్మపాల నాగేశ్వరరావు టిడిపి సీనియర్ నాయకులు తన్నీరు ఎరకయ్య, పల్లెల బుజ్జి, సోమిరెడ్డి రాజు, వంగలపూడి గోవిందు, కోన అప్పలరాజు , జనసేన మండల అధ్యక్షుడు పప్పల శివ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు తప్పని యూరి'యాతన!

- రైతు భరోసా కేంద్రాలు సచివాలయాలు ప్రాథమిక సహకార సంఘాల్లో లభ్యం కాని పంట ఎరువులు
- అధిక ధరలతో అన్నదాత బతుకులతో ఆటలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు
- తక్షణమే జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి
- ఏ.పీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

విశాలాంధ్ర-చోడవరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలు రైతాంగాన్ని యూరి'యా తన' వెంటాడుతోంది. ఎరువులు, విత్తనాలు కల్తీతో పాటు నబజారుకు తరలిస్తూ, కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలు,..... డిమాండ్ సృష్టిస్తూ .. రైతన్న బతుకులతో ఆటలాడుతున్నారని ఏ.పీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక పి.ఎస్ పేట రోడ్డులో గల గ్రోమోర్ కేంద్రంలో యూరియా కోసం రైతన్నల పడిగాపులు, తోపులాటలు పై మీడియాతో సమావేశమైన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మే ప్రైవేటు వ్యాపారుల చర్యలతో అన్నదాతలను యూరి' యాతన' వెంటాడుతోందని తెలిపారు. ఎరువులు విత్తనాల వ్యాపారులను నియంత్రణ చేసే వ్యవసాయ అధికార యంత్రాంగం, ... వ్యాపారులు ఇచ్చే

లంచాలతో మొద్దు నిద్ర నటిస్తుండడంతో, తప్పని సరి పరిస్థితుల్లో అధిక ధరలకు యూరియా కోసం ప్రైవేటు దుకాణాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏడాది వ్యవసాయ గణాంకాల ప్రకారం ఏ పంట ఏ మేర సాగవుతుందో, వాటికి కావలసిన వ్యవసాయాధికారిక ఎరువుల లెక్కలు ఏమవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ప్రతి ఏడాది ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలు పెరుగుతున్నాయే తప్ప రైతాంగానికి ఎరువులు, యూరియా ఉండటం లేదు. ప్రైవేటు, గ్రోమోర్ కంపెనీ వ్యాపారుల ఇష్టారాజ్యంగా అమ్ముతూ యదేచ్ఛగా అన్నదాతలను ఆందోళన పాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏడాదికేడాది పెట్టుబడి ఖర్చులు మితిమీరి పెరుగుతుండడంతో వ్యవసాయదారులు కూలీలుగా మారుతున్నారని తెలిపారు. యూరియా ఎరువులు అమ్మకాల్లో ఇదే విధానం కొనసాగిస్తే కొద్ది రోజుల్లో వ్యవసాయం కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ ఉన్నతాధి కారులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అధిక ధరలకు నల్ల బజారులో అమ్మే వ్యాపారులు, గ్రోమోర్ కంపెనీ దుకాణాలు పై కఠిన చర్యలు తీసుకొని వారి లైసెన్సులు రద్దు చేయాలని, కార్మిక, కర్షక నేత రెడ్డిపల్లి డిమాండ్ చేశారు.

అంగన్వాడీలపై పర్యవేక్షణ అవసరం

విశాలాంధ్ర-నాతవరం : అంగనవాడి కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ అవసరమని జనసేన నాయకుడు నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజన వీర సూర్యచంద్ర అన్నారు. గురువారం నాతవరం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు అంగన్వాడీలచే ఏర్పాటు చేయబడిన 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వీర సూర్యచంద్ర హాజరైనారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ అవసరమని, అంగన్వాడీ సరుకులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందని అన్నారు. ఎంపీపీ లక్ష్మణ్ మూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలలో ఆన్లైన్ సిస్టం ద్వారా సరుకులు ఇవ్వడం మొదలు పెట్టడం జరిగిందని, అంగన్వాడి కేంద్రాలు పిల్లలకు మొదటి అడుగుగా ఉండి వారి ఎదుగుదలకు ముందుకు వెళుతున్నాయని అన్నారు. తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ, మండలంలో కొత్తగా 8 నిర్మిస్తున్నట్లు, అసంపూర్తిగా ఉన్నవి, పాడైపోయిన బిల్డింగులు రిపేర్ చేయడానికి అడుగులు ముందుకేస్తున్నామని అన్నారు.కూటమి ప్రభుత్వం అంగన్వాడీలపై కోట్ల రూపాయలు హెచ్చించి పిల్లలకు పౌష్టికాహారం లోపం లేకుండా ముందుకు వెళుతుందని అన్నారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య మాట్లాడుతూ గునుపూడి అంగన్వాడి కేంద్రం - 1 నందు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గోడ పొడుచారని, దానిపై కలెక్టర్ కూడా ఫిర్యాదు చేసినట్లు, చర్యలు తీసుకోవాలని సిడిపిఓని కోరడం జరిగింది. చివరగా సిడిపిఓ శ్రీ గౌరీ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలపై పర్యవేక్షణ చేస్తున్నామని, తప్పులు చేస్తే ఉపేక్షించమని అన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు గర్భిణీ స్త్రీలకు చేయడం జరిగింది. పౌష్టిక ఆహారం గురించి గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రదర్శన, విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం వంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ కామరెడ్డి వరహాలు బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ,మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు ,నేతల విజయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. మౌనిక , నర్సీపట్నం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు. ..

ప్రతిభ విద్యాలయం కి జాతీయ స్థాయిలో గుర్తింపు

విశాలాంధ్ర-సబ్బవరం: సబ్బవరం ప్రాంతంలో విద్య, క్రీడలు, విలువలు మరియు ఆవిష్కరణలతో సమన్వయంగా సమగ్ర విద్యా విధానాన్ని అమలు చేస్తున్న ప్రతిభ విద్యాలయం, దేశవ్యాప్తంగా గర్వించదగిన స్థానం పొందింది. ప్రతిష్ఠాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్ 2025 లో భారతదేశంలోని అగ్ర 1000 పాఠశాలల్లో ఒకటిగా ఎంపిక కావడం పాఠశాలకు విశేష గౌరవాన్ని తెచ్చిపెట్టిందని ప్రతిభ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన పాఠశాల ర్యాంకింగ్ వ్యవస్థలలో ఒకటి. ఇది ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉన్న 4,000కి పైగా పాఠశాలలను 14 ప్రధాన ప్రమాణాల ఆధారంగా (విద్యా నాణ్యత, బోధనా ప్రమాణాలు, నాయకత్వం, మౌలిక సదుపాయాలు, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలు, విద్యార్థి సంక్షేమం మొదలైనవి) విశ్లేషిస్తుంది. ఈ సర్వేలో 8,000కి పైగా తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు విద్యా నిపుణుల అభిప్రాయాలు తీసుకుని ర్యాంకులు కేటాయిస్తారు. ఈ ర్యాంకింగ్స్ దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల స్థాయిని కొలిచే అత్యంత విశ్వసనీయ ప్రమాణంగా గుర్తించబడింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సరత్ తేజ అదిరెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల ఆంధ్రప్రదేశ్‌లో 12వ స్థానం మరియు విశాఖపట్నంలో 6వ స్థానం సాధించడం ఎంతో గర్వకారణం. ఈ గుర్తింపు మా గురువుల అంకితభావం, విద్యార్థుల కృషి మరియు తల్లిదండ్రుల నమ్మకానికి ప్రతిఫలం. ఇది ప్రతిభ కుటుంబానికి లభించిన గౌరవం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరింత ఉన్నతమైన విద్యా ప్రమాణాలపై కట్టుబడి పనిచేయాలనే బాధ్యతను కూడా కలిగించింది అని తెలిపారు. 1997లో స్థాపించబడిన ప్రతిభ విద్యాలయం, విద్యారంగంలో తన ప్రత్యేక స్థానాన్ని స్థాపించుకుంది. పాఠశాల అకాడమిక్ అద్భుతతతో పాటు, క్రీడలు, సైన్స్ ఫెయిర్లు, రోబోటిక్స్, అటల్ ల్యాబ్స్, STEM ప్రాజెక్టులు, హ్యాకథాన్లు విలువాధారిత బోధనలో ముందంజలో ఉంది.

పాఠశాల నిర్వహిస్తున్న ప్రతిభ కప్ ఇంటర్-స్కూల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విజయం మా ప్రయాణంలో మరో మైలురాయి. ప్రతీ విద్యార్థి భవిష్యత్తు కోసం సమగ్ర అభివృద్ధి కలిగించే వాతావరణాన్ని అందించడమే మా ప్రధాన లక్ష్యం అని డైరెక్టర్ సరత్ తేజ అదిరెడ్డి అన్నారు.

23 నుంచి 25 వరకు వాడ్రాపల్లిలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

సీఎం కప్ పోస్టల్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే, సుందరపు, టీడీపీ ఇంచార్జ్ ప్రగడ

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో నారా చంద్రబాబునాయుడు 15వ సంవత్సరం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు గౌరీ పరమేశ్వరులు నాగులచవితి సందర్భంగా మళ్ల వరహా నరసింగరావు ఆధ్వర్యంలో నతకంపట్టు వద్ద నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మరియు యలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావు చేతుల మీదగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహ నర్సింగరావు,టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆడారి బాలాజీ,బూత్ కన్వీనర్ మళ్ల శంకర్,విల్లూరి సూరిబాబు,కాండ్రేగుల రాము,జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు విల్లూరి మహాలక్ష్మి నాయుడు,టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో పోలీసుల కవాతు

డీఎస్పీ శ్రీనివాస ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

-చెక్ పోస్టులు ఏర్పాటు -కొనసాగుతున్న మత్స్యకారుల నిరసన

విశాలాంధ్ర-నక్కపల్లి: గత కొన్నిరోజులుగా బల్క్ డ్రగ్స్ పార్క్ వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు చేపడుతున్న నిరసనకు సిపిఐ సిపిఎం వైకాపా పార్టీలు మద్దతు తెలిపారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు బి రామచంద్ర యాదవ్ మత్స్యకారులకు నిరసనకు మద్దతు ప్రకటించి ఈనెల 12న మత్స్యకారులు చేపడుతున్న నిరసనకు హైకోర్టు అనుమతులతో వస్తున్నానని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ప్రకటించడంతో ఆయను పోలీసులు విశాఖపట్నంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు నిరసనకు మద్దతు తెలిపిన వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని ఆదివారం మధ్యాహ్నం మత్స్యకారుల నిరసన వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిని నిర్బంధించి రోడ్డుపై బైఠాయించిన విషయం తెలిసిందే. ఈ నెల 15 మత్స్యకారులతో జిల్లా కలెక్టర్ సమావేశం జరగవలసి ఉండగా వాయిదా పడింది. మత్స్యకారులు నిరసన మరింత ఉధృతం చేస్తారనే నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు ముందస్తుగా చర్యల్లో భాగంగా నక్కపల్లి ఉప్మాక జంక్షన్ రాజయ్యపేట వెళ్లే రోడ్డులో మార్గంలో చెక్ పోస్ట్ లోని ఏర్పాటుచేసి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం రాజయ్యపేట గ్రామంలో భారీగా పోలీస్ కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరసనకారులు శాంతియుతంగా నిరసన చేపట్టాలని ఆందోళన ఉధృతం చేస్తే చట్ట పరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

కులదూషణ కేసులో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి విచారణ

విశాలాంధ్ర-రోలుగుంట: అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి గురువారం రోలుగుంట మండలం కే.నాయుడుపాలెం గ్రామాన్ని సందర్శించి, అక్టోబర్ 14న రాత్రి 9 గంటలకు ఉడతపల్లి సత్తిబాబు అనే ఎస్సీ వ్యక్తిపై జరిగిన దాడి కేసులో విచారణ నిర్వహించారు. సమాచారం ప్రకారం, రాయపురెడ్డి ప్రసాద్, గులుమూరి సత్తిబాబు వంటి నిందితులు ఎస్సీ వ్యక్తిని కుల దూషణతో దాడి చేశారు. డీఎస్పీ శ్రావణి నేరస్థుల్ని పరిశీలించి, సాక్షులని విచారించారు. కేసు దర్యాప్తులో ఉందని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.

వీఓఏ లు కృతజ్ఞతా సంబరాలు

విశాలాంధ్ర-యస్.రాయవరం: వెలుగులోని పని చేస్తున్న ఈవోఏలు మూడు సంవత్సరాల కాల పరిమితి నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంపై కృతజ్ఞత సంబరాలు నిర్వహించారు అడ్డరోడ్డులోని ఏర్పాటుచేసిన సమావేశంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న ఈవోఏలు సమస్యను కూటమి ప్రభుత్వం ఈ నిబంధన తొలగించడం ఎంతో హర్షనీయమని అన్నారు. థాంక్యూ సీఎం సార్ అని ప్ల కార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్. ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ వై .వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమల కంటి అబద్ధం ,పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ తుమ్మపాల నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్ .వెంకటరాజు, గింజల లక్ష్మణరావు, సోమిరెడ్డి రాజు, వంగలపూడి గోవిందు కోన అప్పలరాజు ,సమ్మెంగి బీమా తదితరులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లి పెదరామాలయంలో స్ఫూర్తిదాయక ఆధ్యాత్మిక కార్యక్రమం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామం పెదరామాలయంలో ఇటీవల స్ఫూర్తిదాయక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త,భగవద్గీత,లలితా సహస్ర నామ రహస్యాల సంకల్పకర్త ప్రొఫెసర్ సురగిరి రాఘవరావు సత్సంగ, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. ప్రొఫెసర్ రాఘవరావు తన ఉపన్యాసంతో అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతిని అంతరంగంలో ఎలా వెలిగించుకోవాలి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ రిటైర్డ్ ప్రొఫెసర్ తులసీరామ్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (టీటీడీ) ధర్మాచార్య బుద్ధ నరసింహమూర్తి కూడా ప్రసంగించారు. అనంతరం ఆలయ ధర్మకర్త పెతకంశెట్టి రామజోగినాయుడు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో దశవతారం శ్రీనివాసరావు, బొడ్డేటి సత్యనారాయణ, లీలా భాస్కర్, కె.శివరామకృష్ణ, మళ్ల జోగినాయుడు భక్తులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన

రాజయ్యపేట మత్స్యకారులపై ప్రభుత్వ నిర్బంధంపై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆగ్రహం

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లాలో నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో "బల్క్ డ్రగ్స్ పార్కు వద్దు -గంగమ్మ తల్లి ముద్దు" అంటూ గత నెల రోజులుగా శాంతియుతంగా అక్కడి మత్స్యకార ప్రజలు నిరసన తెలుపుతుంటే ఈ పోరాటాన్ని అణచివేయాలనే కుట్రపూరితంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం తీవ్రంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. దీనిని నిరసిస్తూ గురువారం స్థానిక నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేశారు.నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావులు మాట్లాడుతూ. రాజయ్యపేటలో నెలల తరబడి సెక్షన్-30ని అమలు చేస్తున్నారు. పోలీసు పికెట్లు పెట్టి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిపిఐ,సిపిఎం, ఇతర పార్టీల నాయకులను గృహనిర్బంధంలో నిర్బంధిస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఆధార్ కార్డు చూసి గ్రామంలోకి అనుమతిస్తున్నారు. బయట వ్యక్తులను ఎవ్వరినీ గ్రామంలోని అనుమతించడం లేదు. గ్రామం చుట్టూ పోలీసు పహారా పెట్టారు. ప్రజలపై నిర్బంధం ప్రయోగించి, ఉక్కుపాదం మోపి ప్రజలు జీవించే హక్కును, నిరసన చేసే హక్కును, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులంతా ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించి, మత్స్యకారుల పోరాటానికి మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

రాజయ్యపేట వద్ద 1270 ఎకరాల్లో అత్యంత కాలుష్యకారక బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకై 2025 ఆగష్టు-6 ప్రజాభిప్రాయ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి వెళ్లిన నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. గృహనిర్బంధాలు చేశారు. అయినప్పటికీ మత్స్యకారులు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు హానిచేసే బలడ్రగ్స్ పార్కు వద్దని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించని రాష్ట్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్స్ పార్కుకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ వంటి నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నది. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు నిరసనకుదిగారు. పోలీసులు ఈ నిరసనకు అనుమతి ఇవ్వకపోయినా మండుటెండలో, వర్షాల్లో సైతం పట్టుదలగా శాంతియుత నిరసన దీక్షలు చేస్తున్నారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన హెూంమంత్రి సెప్టెంబర్ 29న గ్రామంలోని దీక్షా శిబిరానికి వచ్చి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో మంత్రిని అడ్డుకున్నారు. దీంతో హెూంమంత్రి నిర్మాణ పనులు నిలుపుదల చేస్తామని ప్రకటించడం తప్ప, దీనిని రద్దు చేస్తానని ఎలాంటి హామీ ఇవ్వలేదు. గత ఎన్నికల ముందు రాజయ్యపేట వచ్చిన అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని, బల్క్ డ్రగ్స్ పార్కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించనని హామీ ఇచ్చారు. హెటిరో డ్రగ్స్ పైప్లైన్ సముద్రంలోకి వేయడం వల్ల మత్స్య సంపద చనిపోతుంది. మత్స్య సంపద తగ్గటంతో మత్స్యకారులు గ్రామంలో కుటుంబాన్ని వదలి వలసలబాట పడుతున్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు చర్మవ్యాదులు, ఊపిరితిత్తుల జబ్బులు, క్యాన్సర్, కిడ్నీ వంటి వ్యాధులు రావడానికి హెటిరో డ్రగ్స్ కాలుష్యమే కారణమని స్వయంగా ఒప్పుకున్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజల అమోదం లేకుండా బల్క్ డ్రగ్స్ కంపెనీకి అనుమతులు ఇవ్వబోమని వాగ్దానం చేశారు. "ఏదైనా డబ్బులిచ్చి కొనవచ్చుకానీ, ప్రాణాలు కొనలేమని" అన్నారు. పోరాటాలతోనే

రాజయ్యపేటను రక్షించుకోవాలని పిలుపునిచ్చిన హెూంమంత్రిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఇప్పుడు కాలుష్య కుంపటి బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇచ్చి మత్స్యకారులకు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి మాట తప్పారు. ప్రభుత్వం ఆగకుండా నిర్మాణ పనులు చేస్తున్నది. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిర్మాణ పనులు ఎలా చేస్తారని అడుగుతున్న మత్స్యకారులపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారు. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాజ్యాంగం ఆర్టికల్-21 ప్రకారం ప్రజలు జీవించే హక్కును కాలరాసే విధంగా ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గం. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాభీష్టం మేరకు బల్క్ డ్రగ్స్ పార్కు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు వై ఎన్ భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్ శంకరరావు, వివి శ్రీనివాసరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, రైతు కూలీ సంఘం కె.మోహన్ రావు, రైతుసంఘం జిల్లా కోశాధికారి గండి నాని బాబు, కాళ్ళ తేలయ్యబాబు, అల్లు రాజు, మహిళా సంఘం పరమేశ్వరి, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో సరస్వతి దేవి విగ్రహం ప్రతిష్ట

విశాలాంధ్ర-యస్ .రాయవరం : ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ప్రతిష్టించారు. 2010- 11 సంవత్సరం సంబంధించి 10వ తరగతి పూర్వ విద్యార్థులు సహకారంతో ఈ విగ్రహమును ఏర్పాటు చేయడం జరిగింది. అమ్మవారికి పెట్టిన పట్టుచీరను పూర్వ విద్యార్థులు ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు ఎంఎంఎస్ ప్రశాంతికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ (నాని) గ్రామ పెద్దలు వెదుర్ల బంగారి ,శ్రీపాదల శ్రీను ,కర్రి శ్రీను పి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన భవిష్యత్తుకు, నాణ్యమైన ఆహారం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మంచి భవిష్యత్తుకు మంచి ఆహారం తీసు కోవడానికి చేయి చేయి కలుపుదామని బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గురువారం సత్యవరం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, తాండవ వ్యాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘం సహకారంతో నాణ్యమైన ఆహారం తీసుకునే పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని రకాల ఆహార పదార్థాలు సమతుల్యంగా తీసుకోవడం గురించి మహిళలు, గ్రామస్తులతో చర్చించారు. ముందు తరం వారు తీసుకున్న ఆకుకూరలు ప్రస్తుతం చాలామంది వండడం లేదని, రకరకాల వచ్చి కూరలు కూడా ఆహారంగా తీసుకోవచ్చునని, గ్రామంలో పుష్కలంగా దొరికే మునగాకు, అవిశాకు కూడా ఆహారంగా తీసుకోవచ్చని తెలియజేశారు. ధాన్యాలు, పప్పు గింజలు, నూనె గింజలతోపాటు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అటవీ ఫలాలు కూడా సమతుల్యంగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సకిలేటి రాము అన్నారు. ఈ సందర్భంగా మహిళలతో రోజువారి తీసుకుంటున్న ఆహారపు అలవాట్ల గురించి చర్చించి అందులో మార్చు కోవలసిన అంశాలను తెలియజేశారు. చిరుధాన్యాలను గంజి రూపంలో, ఉప్మా రూపంలో తీసుకోవచ్చునని, ఆకుకూరలపై అధికంగా దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తాండవ రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రతినిధులు కృష్ణ, సూర్యనారాయణ, నూకరాజు, గ్రామ పెద్దలు నానాజీ, శాస్త్రవేత్తలు డాక్టర్ శివ, డాక్టర్ విజయర్షా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమం

విశాలాంధ్ర-పాయకరావుపేట : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి రచ్చబండ, కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలంలోని సీతారాంపురం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని మెడికల్ కాలేజీలు నిర్మించారని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేయడం దారుణం అన్నారు. ప్రజలకోసం నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ కాకుండా ఉండటానికి ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేసి కోటి సంతకాల్లో పాలుపంచు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబూరావు, జగతా శ్రీను, పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి సత్య మహేష్, ఇసరపు తాతారావు, దేవవరపు వెంకటేశ్వరరావు, సర్పంచ్ పన్నీరు పాపారావు, పల్యాల లక్ష్మణరావు, పక్కుర్తి లోవ కుమార్, రామాల శ్రీను, యజ్జల సత్యనారాయణ, దేవవరపు రాజేష్ ఖన్నా, బోడపాటి గోవింద్, గదుల లోవరాజు, కాకడ కృష్ణ, బొడ్డ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ద్వారానే సమతుల్య ఆరోగ్యం
ఎంపీపీ భోకం సూర్యకుమారి

విశాలాంధ్ర-సబ్బవరం: గర్భిణీ స్త్రీలు, బాలింతలు, బాల బాలికలు ప్రతి రోజు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సమతుల్య ఆరోగ్యం సాధ్యమవుతుందని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రామనాయుడు అన్నారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు, పిల్లలకు, కిషోర్ బాలికలకు పోషకాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ పోషకాహారం ముఖ్యంగా గర్భవతులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారన్నారు. పోషకాహారం తీసుకోవడంలో మగవారి భాగస్వామ్యం కూడా ఉండాలని మగవారికి కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అంతకుముందు ఐ సి డి ఎస్, పి. డి సూర్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ మాసం గత నెల 17 నుండి ఈ నెల 16 వరకు గ్రామస్థాయిలోనూ, మండల స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు గర్భవతులకు పోషకాహారం పై అవగాహన కల్పించడమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. ముఖ్యంగా గర్భవతులు స్వీటు,పంచదార,ఉప్పు వినియోగాన్ని తగ్గించాలన్నారు. గర్భవతులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణీలకు స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి ఐ సి డి ఎస్ పిడి సూర్యలక్ష్మి,పి. ఓ వి. లలిత కుమారి, సర్పంచులు గర్భవతులకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మామిడి లక్ష్మి కొండాజి,ఎంపీడీవో పి. పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో చైతన్య,సర్పంచులు సబ్బవరపు నారాయణమూర్తి,పడాల వెంకటరమణ,ఎంపిటిసి కర్రి అప్పారావు,గవర రాజు, పలువురు అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేని బ్లాస్టింగ్ లు జరపాలి
వైసిపి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా

విశాలాంధ్ర -పాయకరావుపేట: పోలవరం కాలువ తవ్వకాల్లో భాగంగా ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేని, భయాందోళన కలిగించని బ్లాస్టింగ్ లు జరపాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోలవరం కాలువ అవసరమేనని, దానికి తమ పార్టీ గానీ, తాము గాని వ్యతిరేకం కాదని, అయితే కాలువ తవ్వకాల కోసం చేస్తున్న బ్లాస్టింగ్ లు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని ఆరోపించారు. కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉండగా, సామర్థ్యాన్ని పెంచి రాళ్లు ఎగిసిపడేలా అన్ కంట్రోల్ బ్లాస్టింగ్ చేసి ఆ ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆ ప్రాంత ప్రజల ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, కొంతమంది స్వల్ప గాయాల పాలైన సంఘటనలు జరిగాయన్నారు. బ్లాస్టింగ్ ల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేని బ్లాస్టింగ్ లు జరపాలని, లేదంటే వైసీపీ తరఫున పనులు నిలుపుదల చేసి ఆందోళన చేస్తామని దగ్గుపల్లి సాయిబాబా హెచ్చరించారు.

17,18 తేదీల్లో మండల స్థాయి ఆటలు పోటీలు

విశాలాంధ్ర-పాయకరావుపేట : ఈనెల 17, 18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జి.రమేష్ బాబు తెలిపారు. మండలంలోని 15 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 575 మంది విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, అథ్లెటిక్స్, షటిల్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మొదటిరోజు బాలురు, రెండవ రోజు బాలికలు ఆటల పోటీల్లో పాల్గొంటారని మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు తెలిపారు.

ఘనంగా రాష్ట్రీయ పోషణ మాసోత్సవం

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 12 మంది గర్భిణీలకు సీమంతాలతో పాటు అన్న ప్రసన్న కార్యక్రమాలను జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ చిన్నతనం ఉండే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలు కృషితో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు మండల మహిళా అధ్యక్షురాలు ఉన్నీసా పిఎసిఎస్ చైర్మన్ కొప్పిసెట్టి బుజ్జి నక్కపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు ఐసిడిఎస్ సూపర్వైజర్లు లలిత సత్యవతి నిషా దుర్గ సత్య సుజాత రంజాన్ బేబీ తదితరులు పాల్గొన్నారు

ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీగా మురళీమోహన్

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సీనియర్ అసిస్టెంట్గా పనిచేయుచున్న ఎన్. మురళి మోహన్ ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సవ్ అసోసియేషన్, తాడేపల్లి, అమరావతి సెక్రటరిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ పి. శిరిషారాణి అధ్యక్షతన ఎన్. మురళి మోహన్ ని ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతితక్కువ సమయంలో సీట్ సెక్రటరిగా ఎంపిక కావటం కళాశాలకు గర్వ కారణమే కాక ఏపీ ఇంటర్మడియట్ బోర్డు క కూడా చాలా మంచి జరుగుతుందని అన్నారు. ఎంప్లాయిస్ సంక్షేమమే ధ్యేయంగా మురళి మోహన్ తన పదవికి వన్నీ తేవాలని భోదన మరియు భోదనేతర సిబ్బందీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎ.జనార్ధనావు, ఎమ్. మెహనావు, పి.శుబాషిణి, పి. సుర్వాశ్రీ, బి. గోవిందరావు, ఎస్.ఎల్. ఎన్. వి. ఉదయ్ కుమార్, ఎన్. శ్రీనివాసరావు, బి బాష్టనాయుడు, ఎల్.వి. రమణబాబు, ఎమ్. వెంక్రలటావు, పిరాణి అంజ్మెకర్ పి.పి.సి.విచ్. వరప్రసాద్, డి. అన్నపుర్ణ, అనువదు, నీలిమ ఎమ్. అప్పలనాయుదు, వరప్రసాద్, తదితరలు పాల్గోన్నారు.